క్లుప్తంగా

అదనపు కలెక్టర్ తనిఖీ

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం గ్రామంలో డంపింగ్ యార్డును పరిశీలించారు. వానకాలంలో పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కార్యదర్శికి సూచించారు. అలాగే ఇటీవల గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ గీతాంజలి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి

గండేడ్: గ్రామాల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చాలామంది ఈకేవైసీ చేయించుకోలేదని, అలాంటి వారిని డీలర్లు గుర్తించి నవంబర్ చివరికల్లా పూర్తి చేయాలన్నారు.

శిష్యుడిని సంస్కరించే వాడే గురువు



స్టేషన్ మహబూబ్‌నగర్: శిష్యుడిని సంస్కరించే వాడే గురువని యోగా గురువు, సుప్రభాత్ హెల్త్‌క్లబ్ కన్వీనర్ జి.పాండురంగం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలోని యోగా కేంద్రంలో ముందస్తు గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ.. శిష్యులు అభివృద్ధిలోకి వచ్చినపుడే గురువుకు అసలైన ఆనందం కలుగుతుందన్నారు. అనంతరం గురువును హెల్త్ క్లబ్ సభ్యులు శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో శంకరయ్య, కానుగడ్డ యాదయ్య, సుగుణ, ప్రశాంతి, సీమా తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్‌రూరల్: మండలంలోని మాచన్‌పల్లిలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా నాగన్న, శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా రామాంజనేయులు, కార్యదర్శులుగా నాగరాజు, రాజుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, మండల అధ్యక్షుడు చంద్రుడు, ప్రచార కార్యదర్శి యాదయ్య, నాయకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మెనూ పాటించాలి

గండేడ్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల అధికారులతో కలిసి వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరోజూ ఆకుకూరలు, గుడ్డు తప్పకుండా వడ్డించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో రోగాలు ప్రబలే అవకాశం ఉందని పరిశుభ్రత పాటించాలన్నా రు. అనంతరం వసతులపై ఆరా తీశారు. వెంట ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ జనార్దన్‌తోపాటు ప్రిన్సిపాల్ రైయిసీ ఫాతిమా ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా రాణించాలి



గండేడ్: గ్రామీణ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. మండలంలోని రుసుంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన చిట్యాల యాదగిరి విద్యార్థులకు ఉచితంగా టై బెల్టులు బహూకరించారు. వాటిని బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నంచర్ల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎం చంద్రకాంత్, గ్రామస్తులు భీమయ్య, శివ, వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ

జడ్చర్ల: జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఏఎస్పీ రత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సీఐ కమలాకర్,రూరల్ సీఐనాగార్జునగౌడ్‌తో ఆ యన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు,ట్రాఫిక్,రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై చర్చించారు.ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.

యువకుడు అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లికి చెందిన ఎరుకలి రాఘవేందర్(22) ఈనెల 6వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడని సీఐ కమలాకర్ తెలిపారు. చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కదం తొక్కిన కార్మికులు

- సార్వత్రిక సమ్మెలో సమరశంఖం
- ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో సమ్మె
- ర్యాలీలు, ధర్నాలు, సభలతో సమస్యలపై నినాదం


జిల్లాకేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల టౌన్/దేవరకద్ర : ఆల్ ట్రేడ్ యూనియన్ల పిలుపుమేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని కార్మికులు కదం తొక్కారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం సమర శంఖం పూరించింది. బుధవారం సార్వత్రిక సమ్మెలో సకల కార్మికులు మున్సిపల్ టౌన్ హాల్‌లోని భారీసభలో వేలాదిమంది కార్మికులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించి నినాదాలు చేశారు. రైతులు వ్యవసాయ కూలీలు, కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ కార్మికులు, జీపీ, పుర, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం , ఫీల్డ్ అసిస్టెంట్లు, బ్యాంకు ఉద్యోగులు, మెడికల్ రిప్స్, పెయింటర్లు, ప్లంబర్లు, టైల్స్ వర్కర్స్, ఫంక్షన్ హాల్ వర్కర్స్, రైస్‌మిల్ వర్కర్స్, కేజీబీవీ వర్కర్లు, రిటైర్డ్ పెన్షనర్స్ తదితరులు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ టౌన్‌హాలులో నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, టీఎన్‌టీయూసీ జిల్లా నాయకులు రాములు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా మరో స్వతంత్ర ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు హాజరై కార్మికుల న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలన్నారు.

కార్మికుల సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామదాసు, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నారాయణ గౌడ్, ఐఎన్టీయూసీ జిల్లా కోశాధికారి విజయబాబు, మెడికల్ రీప్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభన్ యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మద్దతు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెతో కేంద్రం దిగిరాకుంటే మరోపోరాటం తప్పదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. అందుకు కార్మికులంతా సిద్ధం కావాలన్నారు. అంతకుముందు పట్టణంలోని చంద్రగార్డెన్ నుంచి ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, వర్కర్లు ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. సభలో దీప్లానాయక్, సత్తయ్య, వెంకటేశ్, జగన్, ప్రభావతి, శంకర్ పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు జడ్చర్ల డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏడీఈ చంద్రశేఖర్, జేఏసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఎల్ఐసీ బ్రాంచీ ఆవరణలో ఎల్ఐసీ, వివిధ బ్యాంకుల ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు కిల్లెగోపాల్, ఐసీఈయూ హైదరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయ కుడు వీరాంజనేయులు, బ్యాంక్ ఎంప్లాయిస్ సంఘం రాజేశ్, తిరుమల్‌రెడ్డి, ఐసీఈయూ మహబూబ్‌నగర్ బ్రాంచ్ కార్యదర్శి కరుణాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు 26 వేల కనీస వేతనాలివ్వాలి

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్‌నాయక్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రంలో కార్మికులు ఎర్రజెండాలు పట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల నేతలు, కార్మికులు వందలాదిగా తరలి వచ్చి పాతబస్టాండ్, రాయిచూర్ రోడ్, కోయిల్‌సాగర్ రోడ్, కొత్త బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. సమ్మెలో సీపీఐ ఎంఎల్ నాయకులు రాంచందర్, కొండారెడ్డి, టీయూసీఐ నాయకులు సాంబశివుడు, సీఐటీయూ నాయకులు వేణుగోపాల్, కార్మిక సంఘం నాయకులు, ప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


దేవరకద్రలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమ్మెకు హాజరైన ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు, కార్మికులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ సమీపంలోని దుందుబీ వాగు నుంచి బుధవారం తెల్లవారుజామున అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తలిస్తున్న మిడ్జిల్‌కు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



గండేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెన్నాచేడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, మెటీరియల్ కొరత ఇతరత్రా ఇబ్బందులను తెలుసుకున్నారు. నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తే దశల వారీగా బిల్లులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ జనార్దన్, మాజీ సర్పంచ్ అనంతలక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కేశవులు, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎస్ 2ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రార్థనలో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు మంచిబోధన అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి అల్పాహారం



నవాబ్‌పేట: మండలంలోని ఎన్మన్‌గండ్ల బాలుర వసతి గృహం, బాలికల వసతిగృహం, కళాశాల విద్యార్థినుల వసతి గృహాలను బుధవారం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అధికారుల బృందం బ్రేక్‌ఫాస్ట్ చేసి వారి సమస్యపై ఆరాతీశారు. విద్యార్థులకు అందించే మెనూతోపాటు వారికి అందిన వస్తువులు, ఆహారపదార్థాలు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి సునీత, ఎంపీడీఓ జయరాంనాయక్, ఈఓపీఆర్డీ నసీర్ అహ్మద్, హాస్టల్ వార్డెన్‌లు బండెమ్మ, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇరిగేషన్‌పై కనీస అవగాహన లేని ఎమ్మెల్యే


అడ్డాకులలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


భూత్పూర్‌లో మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్/అడ్డాకుల/చిన్నచింతకుంట/దేవరకద్ర : దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇరిగేషన్‌పై కనీస అవగాహన లేనివిధంగా మాట్లా డుతున్నారని, అందుకే వందశాతం గప్లత్‌లో గెలిచావని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఉద్ఘాటించడం సరైందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బస్వరాజ్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 30 చెక్‌డ్యాంల ఏర్పాటుతో బీడు భూములు సస్యశ్యామలంగా మారడం ఎమ్మెల్యే కళ్లకు కన్పించడంలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి విమర్శిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి నివాసంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు జితేందర్‌రెడ్డి, జయన్నగౌడ్ , చక్రపాణిరెడ్డి, రమేశ్‌గౌడ్, విజయ్‌కుమార్‌రెడ్డి, ఖాజాఘోరీ విలేకరులతో మాట్లాడారు.

పదువులను త్యాగం చేసిండు

మాజీ ఎమ్మెల్యే ఆల తెలంగాణ ఉద్యమ సమయంలో తన పదవిని త్యాగం చేశారని మూసాపేట మండల నాయకులు పేర్కొన్నారు. కొమిరెడ్డిపల్లిలో ఇంద్రయ్యసాగర్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ బుధవారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల ఎమ్మెల్యేగా పని చేసిన ఆలపై ఎమ్మెల్యే అసభ్యంగా మాట్లాడటం సరికాదన్నారు.

మాజీ ఎమ్యెల్యే ఆలపై ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోటరాము అన్నారు. బుధవారం సీసీకుంటలోని మోహన్‌గౌడ్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మరోసారి ఆలపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, వెంకటేశ్వర్ రెడ్డి, మోహన్‌గౌడ్, రాము, రవీందర్‌రెడ్డి, రఘుగౌడ్ పలువురు ఉన్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తనస్థాయిని మరిచి పౌరుష పదజాలంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దేవరకద్రలో వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీకాంత్‌యాదవ్, కరణం రాజు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా వాహనాల పార్కింగ్


న్యూగంజ్ బ్రిడ్జి కింద కారు పార్కింగ్ చేసి చుట్టూ జాలీ ఏర్పాటు చేసి తాళం వేసిన వైనం


న్యూగంజ్ బ్రిడ్జి కింద మొక్కల మాటున పార్కింగ్ చేసిన కార్లు

- మున్సిపల్ స్థలంలో చుట్టూ జాలీ ఏర్పాటు ఆపై తాళం వేసిన ఓ వ్యక్తి
- న్యూగంజ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఇదీ పరిస్థితి
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూగంజ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఖాళీ స్థలం ఉండడంతో మున్సిపల్ అధికారులు ఏడాది క్రితమే వన మహోత్సవంలో భాగంగా పెద్ద పెద్ద మొక్కలు నాటారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. సమీపంలోని కొందరు ప్రైవేట్ వ్యక్తులు తమ వాహనాలను అక్కడ ఎలాంటి అనుమతి లేకుండా కొన్నేళ్లుగా పార్కింగ్ చేస్తున్నారు. రోజంతా రెండు వాహనాలకు కవర్లు కప్పడంతోపాటు ఏకంగా మరో వ్యక్తి తన కారును అందులో ఉంచి చుట్టూ ఇనుప జాలీ ఏర్పాటు చేసి తాళం వేయడం కొసమెరుపు. ఇలా ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా వినియోగిస్తున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. త్వరలోనే ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధ్యులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఉల్లాసం ఉంటుందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులపాటు నిర్వహించిన క్రీడా ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా విజేతలకు వీసీ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం సెంట్రల్ యూనవర్సిటీ ప్రొఫెసర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఏబీవీపీ సంస్థలో పనిచేసే ప్రతిఒక్కరూ ఒక్కో సైనికుడితో సమానమన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంగీత, జిల్లా ప్రముఖ్ వేణు, నగర అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, వివేక్, రామకృష్ణ, విద్యార్థులు కృష్ణకుమార్, నాగేశ్, రవితేజ, వేణుగోపాల్, నందిని శివ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులు పరిష్కరించాలి

భూత్పూర్: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తి చేసి పరిష్కరించాలని, మండలంలో వచ్చిన దరఖాస్తుల వివరాలు, ఏఏ భూ సమస్యలపై దరఖాస్తులు అధికంగా వచ్చాయని కలెక్టర్ తహసీల్దార్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 635మంది రైతులు మిస్సింగ్ సర్వేనెంబర్లు, సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో 310మంది రైతుల దరఖాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేశామని తహసీల్దార్ వివరించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ గీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ పేరుతోనే పథకాల అమలు


బుద్దారంలో మహిళలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బుద్దారంలో జరిగిన ఇందిరా మహిళాశక్తి సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ఓట్లు వేస్తేనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అనేక పథకాలు మహిళల పేరుతోనే అమలు చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో వచ్చే పథకాలకు కూడా మహిళల పేర్లు పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్, రైతులకు ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ, రైతుబంధు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సరేందర్‌రెడ్డి, కృష్ణయ్య, మండలాధ్యక్షుడు మహేందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు నవనీత, కృష్ణయ్య, చెన్నయ్య, వెంకటయ్య, యాదిరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘విద్యుత్’ ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమిస్తాం


విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చంద్రమౌళి అన్నారు. ప్రైవేటీకరణను ఖండిస్తూ బుధవారం విద్యుత్ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూపీ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. యూపీ మాదిరిగా తెలంగాణ రాష్ట్రం పరిస్థితి ఏర్పడితే ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ సంస్థల ప్రవేటీకరణతో రైతాంగం తీవ్రంగా నష్టపోతారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ సదుపాయాలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈ నవీన్, నాయకులు స్వామి, బాబ్య, సుధీర్‌రెడ్డి, విజయ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కులు అందజేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణానికి చెందిన 39మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాలమూరును ఎడ్యుకేషనల్, మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్య, వైద్య రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రైతులు, కూరగాయల వ్యాపారులకు సూచించారు. టీడీగుట్ట సమీపంలోని మార్కెట్‌లో కొనసాగుతున్న పాత రైతు బజార్‌ను బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కుళ్లిన కాయగూరలు, ఇతర వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేయొద్దన్నారు. అలాగే అక్కడే నిర్మిస్తున్న మాంసం మార్కెట్ భవనాన్ని తనిఖీ చేశారు. అనంతరం మౌలాలిగుట్టలోని జంతువుల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతినిత్యం నగరంలోని ఎన్ని వీధి కుక్కలను పట్టుకుని ఇక్కడికి తరలించి కుని చికిత్సలు చేస్తున్నారో నిర్వాహకులతో ఆరా తీశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

జడ్చర్ల టౌన్: వందరోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం కావేరమ్మపేట మున్సిపాలిటీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఫుడ్‌ఫెస్టివల్ ఆకట్టుకుంది. మెప్మా మహిళా సంఘాల ఆధ్వర్యంలో పలురకాల ఆహార పదార్థాలు ప్రదర్శన, విక్రయానికి ఉంచారు. వీటితోపాటు ప్లాస్టిక్ నివారణపై అవగాహన పెంచేలా బుట్టలు, బట్టబ్యాగులు ఏర్పాటు చేశారు. ప్రదర్శనను చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్‌చైర్‌పర్సన్ సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సతీశ్, జ్యోతి, ఉమాశంకర్‌గౌడ్, చైతన్య చౌహాన్, కుమ్మరి రాజు, ప్రశాంత్‌రెడ్డి, చైతన్య, మహేశ్‌పాల్గొని ఆహార పదార్థాలు కొనుగోలు చేశారు.

దివ్యాంగుల పాఠశాలకు టీవీ వితరణ

దేవరకద్ర: మండల కేంద్రంలోని భవితా దివ్యాంగుల పాఠశాలకు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, మండల కాంగ్రెస్ నాయకులు కోన రాజశేఖర్ టీవీని అందజేశారు. బుధవారం ఆయన పాఠశాలను సందర్శించి ముందుగా దివ్యాంగుల నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మానసిక పరిస్థితి సరిగ్గా లేని విద్యార్థుల వినోదం కోసం కొత్త టీవీని అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ బలరాం, కాంప్లెక్స్ హెచ్‌ఎమ్ నాగేంద్రమ్మ, సిబ్బంది అనురాధ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైల్ రోకోకు మద్దతు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టిన రైల్‌రోకోకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పీయూ విద్యార్థి నాయకులు ప్రకటించారు. భరత్, ఆంజనేయులు, రామకృష్ణ, వెంకటేశ్, విష్ణు, వినోద్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓగా గార్లపహాడ్ పీఏసీఎస్

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ సహకార సంఘం ఎఫ్‌పీఓగా ఎంపికైనట్లు జిల్లా సహకార శాఖ అధికారి శంకరాచారి తెలిపారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 311 ఎఫ్‌పీఓలు ఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలో 7 పీఏసీఎస్‌లు ఎఫ్‌పీఓగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ ఎంపికతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వీటి నిర్వాహణ ఉంటుందన్నారు. మేనేజ్‌మెంట్‌కు మూడేళ్లకు రూ.18లక్షలు, గ్రాంట్‌కింద రూ.15లక్షలు సమానంగా ఎఫ్‌పీఓ సభ్యుల ద్వారా ఒక్కొక్కరి నుంచి రూ.2వేల వాటాధనం పోగుచేయాల్సి ఉంటుందన్నారు. మండలంలోని రైతులు రూ.2వేలు చెల్లించి వాటధనం పొందాలని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయానికి డ్రోన్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వాటి ప్రాధాన్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మానిటరింగ్ ఆఫీసర్ వీరభద్రయ్య, బాషన్న పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

కోయిల్‌కొండ: ఆయిల్‌పాం సాగుచేసి రైతులు అధిక లాభాలు పొందాలని ఉద్యావనశాఖ జిల్లా అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని అనంతపూర్, కోయిల్‌కొండలో ఆయిల్ పాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్ పాం మొక్కలు, బిందుసేద్యం రాయితీల గురించి రైతులకు వివరించారు. ఉద్యాన పంటలు అయినటువంటి పండ్లతోటలు, కూరగాయాలకు ప్రభుత్వం సబ్సిడి ఇస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పాం వేసుకునే పంటలకు చిన్నసన్నకారు రైతులకు 90శాతం రాయితీతో డ్రిప్పు, మొక్కలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పెద్ద రైతులకు 80శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యనవనశాఖ మండల అధికారి స్వప్న, ఏవో యామారెడ్డి పాల్గొన్నారు.